క్లుప్తంగా

పాలిసెట్-25కు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్స్‌పాల్ టీవీ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు, ఈ ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులతో సహా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాలిసెట్-25 ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 30వ తేదీన జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.100, బీసీ, ఓసీలు రూ.400 ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. వివరాలకు ఫోను: 9052969643, 9000877530 సంప్రదించాలని తెలిపారు. http;//absbtet.ap. gov. in http;/ polycetap. nic. in వెబ్‌సైట్‌లను చూడవచ్చునన్నారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు



సత్తెనపల్లి: ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఆఖరి రోజు ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. పట్టణంలోని మొత్తం ఆరు సెంటర్లలో చివరి రోజు జనరల్ విభాగంలో 1,152 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,045 మంది హాజరయ్యారు. 107 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 26 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరయ్యారు. స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాలను సందర్శించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల



88త్యాళ్లూరు(క్రోసూరు) : మండలంలోని 88త్యాళ్లూరు గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉయ్యందన, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం తిరునాళ్ల సందర్భంగా పెద్ద ఎత్తున్న సంబరాలు, అంగళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభలు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త అత్తోట శ్రీనివాసరావు తిరునాళ్ల మహోత్సవాన్ని పర్యవేక్షించారు. అర్చకులు హనుమంతరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



హసనాబాద్(క్రోసూరు): ఎన్ఆర్ఐ భానుప్రకాశ్ సహకారంతో మాగులూరి ఫౌండేషన్ ద్వారా మండలంలోని హసనాబాద్ గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రి అందించినట్లు పాఠశాల హెచ్ఎం వై.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు స్కేల్, పెన్సిల్, పెన్, ప్యాడ్ తదితర పరీక్ష సామగ్రి అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న డాక్టర్ గజ్జల



నకరికల్లు: ముస్లిం మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపల్లి మసీదులో శనివారం నిర్వహించిన రంజాన్ మాసం నమాజులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో మమేకమై ప్రపంచ శాంతి కోసం దువా చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు టోపీ, చౌకమ్‌లతో డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డిని సత్కరించారు. చందా ఇస్మాయిల్ ఇచ్చిన ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొని ఉపవాస దీక్షాపరులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గుత్తికొండ నన్నేసా, దూదేకుల బాషా, నకరికంటి కరిముల్లా, ముజావర్ మస్తాన్‌వలి, హుస్సేన్‌బాషా, ముజావర్ సైదా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలపై 'పీ-4' పిడుగు

- 27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే
- ఇంటిలోని విలువైన వస్తువుల వివరాలు నమోదు
- సంక్షేమ పథకాలు తొలగిస్తారేమోనని లబ్ధిదారుల్లో ఆందోళన
- సత్తెనపల్లి డివిజన్‌లో 1,43,623 కుటుంబాలు

కూటమి ప్రభుత్వం తాజాగా పీ-4 పేరుతో సర్వే నిర్వహిస్తుంది. నిజానికి ఈ సర్వే అత్యంత వెనుకబడిన కుటుంబాల గుర్తింపునకు అని చెబుతున్నా ఇందులోని ప్రశ్నలు ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ మొదలు కుటుంబ సభ్యుల చదువు, ఉద్యోగాల వరకు సర్వే నిర్వహిస్తుండడంతో సంక్షేమ పథకాలు ఎక్కడ తొలగిస్తారో అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నిజానికి ఇవాళ స్మార్ట్‌ఫోన్ సర్వసాధారణం అయిపోయింది. దీంతో పలువురు ఈ సర్వేకు నిరాకరిస్తున్నారు.



భట్లూరులో పీ-4 సర్వేలో సచివాలయ ఉద్యోగులు

సత్తెనపల్లి: కూటమి నేతలు తాజాగా పీ-4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తి వేసేందుకు శ్రీకారం చుట్టారు. స్మార్ట్ ఫోన్, టీవీ, ఏసీ, ఇతర గృహోపకరణాలు, బైక్‌లున్నాయా..? ఇంటి స్వరూపం, రేకులా, స్లాబా, బ్యాంక్ అకౌంట్, ఇలా 27 రకాల ప్రశ్నలకు సంబంధించి సమాధానాలు సేకరించి సంబంధిత వివరాలను సచివాలయ సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోనుకు వచ్చిన ఓటీపీని నమోదు చేసి ప్రక్రియను ముగిస్తున్నారు.

- సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల పరిధిలో 1,43,623 కుటుంబాలు (2011 జనాభా లెక్కల ప్రకారం) ఉన్నాయి.
- వీరిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో అప్పో సప్పో చేసి నెలవారి వాయిదాల్లో లేక ఎవరైనా కానుకగా ఇస్తే వారి ఇళ్లల్లో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకుంటారు. ఏసీ ఉందని తెలిస్తే చాలు సచివాలయ సిబ్బంది ఆ వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.
- దీంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది. వివిధ గ్రామాల్లో ప్రస్తుతం ఈ సర్వే చడీ చప్పుడూ లేకుండా జరుగుతుంది. ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి రోజుకు తమ పరిధిలోని 200 కుటుంబాల్లో సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వారిలో ఆందోళన నెలకొంది.

నిరాకరించినా.. నమోదు

సర్వేలో సిబ్బంది పొందుపరిచే అంశాలు ప్రస్తుత జీవన శైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్లు, బైకులు, ఇలాంటి ప్రశ్నలు ఉండడంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది. పీ-4 సర్వేను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, దీని ద్వారా సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు కింది స్థాయి అధికారులకు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

సతమతమవుతున్న సిబ్బంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రం హోం, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, ఆరేళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లతో పాటు ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణ అడుగుతుండడంతో సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

నకరికల్లు: ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మండల ప్రత్యేకాధికారి హీరాలాల్ కోరారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీఓ జి.కాశయ్య, పారిశుద్ధ్య కార్మికులతో పాటు వీధులను ఊడ్చి చెత్తను తొలగించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.జగదీష్, కొమ్మవరపు అప్పారావు, గ్రామస్తుల దాసయ్య పాల్గొన్నారు.



మాదలలో ర్యాలీలో అధికారులు, సిబ్బంది



తురకపాలెంలో...

మాదలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను శనివారం తొలగించారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామూహిక మరుగుదొడ్ల పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో పంచాయతీ సిబ్బంది, అధికారులు ర్యాలీ నిర్వహించారు.



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శివనాగేశ్వరరావు, ఎంపీడీవో

ర్యాలీలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కే కాంతారావు, ఈఓపీఆర్డీ రూపవతి, ఇన్‌చార్జ్ సర్పంచ్ సైదుబాబు, పంచాయతీ కార్యదర్శి శివాజీ, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత హీ సేవా

క్రోసూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయం అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రత్యేక అధికారి శివనాగేశ్వరరావు, ఎంపీడీవో జి.శ్రీనివాస్, పంచాయతీ అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తడి పొడి చెత్త డబ్బాలను అందజేశారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే చక్కని ఆరోగ్యం

పెదకూరపాడు : పరిసరాల శుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంత మవుతుందని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయం, లగడపాడు రహదారిలో స్వచ్ఛాంధ్రలో భాగంగా సిబ్బందితో కలసి పరిసరాలను శుభ్రం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో కలసి ఆసుపత్రి ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

అమరావతి: తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల ప్రత్యేకాధికారి రాజగోపాల్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కూరగాయల మార్కెట్, ధ్యానబుద్ధ వనం, బుద్ధ విగ్రహం, అమరావతి స్థూపం పరిసరాలను అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ప్రజలు కూడా స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సహకరించాలని ఆయన తెలిపారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డానియల్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రతపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని పంచాయతీల్లో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్లు, పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తూ శనివారం గ్రామ సభలు నిర్వహించి తీర్మానం చేశారు. బట్లూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక పరిశీలకులు పి.శ్రీనివాసరావు, విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన పాల్గొన్నారు.



అమరావతిలో...



బట్లూరులో ర్యాలీలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

పాలిథిన్‌ను నిషేధించి పర్యావరణాన్ని రక్షించాలి

మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్

సత్తెనపల్లి: పాలిథిన్ వాడకాన్ని నిషేధించి జూట్ బ్యాగులను, గుడ్డ సంచులను వాడటం ద్వారా పర్యావరణాన్ని రక్షించగలమని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం.. పునర్వినియోగ వస్తువుల వాడకం' కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లో క్యారీ బ్యాగులను సీజ్ చేశారు. మార్కెట్ లోపల, బయట శుభ్రపరిచారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని వావిలాల పార్కులో పరిసరాలను, పాత బైపాస్ రోడ్‌లోని వల్లూరబుల్ పాయింట్‌ను శుభ్రపరిచారు. మున్సిపల్ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పాలిథిన్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. పాలిథిన్ వాడకాన్ని నిషేధించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వ్యాపార, వాణిజ్య సంస్థలపై అపరాధ రుసుములు విధించబడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, కౌన్సిలర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



తాలూకా సెంటర్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

హోలీ ఫ్యామిలీ పాఠశాలలో స్పాసెర్-2కే25

సత్తెనపల్లి: విద్యార్థులు చేపట్టే చిన్న చిన్న ప్రయోగాలే భావితరం శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడతాయని నలంద ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ అన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పాసెర్-2కే25 సైన్స్ ఎక్స్‌పోలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక భావనలను పెంపొందించి నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది బాపయ్య చౌదరి, పాఠశాల కరస్పాండెంట్ రెవ.సిస్టర్ ట్రీసా, పాఠశాల హెచ్ఎం సిస్టర్ విజయారాణి, సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నమూనాలను పరిశీలిస్తున్న నలంద ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కుమార్

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఈఓ ఏకుల ప్రసాదరావు

అచ్చంపేట: ఈ నెల 17 సోమవారం నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఏకుల ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొత్తం 10 పాఠశాలల నుంచి 551 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందుకు గాను మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు, ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలతో పాటు ఈ యేడాది నూతనంగా చిగురుపాడు పంచాయతీ పరిధిలోని బ్లూబెల్ హైస్కూలులో కూడా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరచామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించామన్నారు.

నాటుసారా నిర్మూలనకు సహకరించండి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి

అచ్చంపేట: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలో నాటుసారా తయారీ, విక్రయాలను నిర్మూలించేందుకు సహకరించాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్‌ను శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం 2.0లో భాగంగా గ్రామాలు, తండాలలో నాటుసారా విక్రయ కేంద్రాలు, బట్టీలు ఏర్పాటు చేసి నాటుసారా కాయడాన్ని నిర్మూలించేందుకు పోలీస్, ఫారెస్ట్, హెల్త్ డిపార్టుమెంట్స్‌తో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే పాత ముద్దాయిలను, కొందరు అనుమానితులను బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో సభలు ఏర్పాటు చేసి సారా వల్ల కలిగే అనర్థాలు, కుటుంబాలకు జరిగే నష్టాలను వివరించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే మండల మేజిస్ట్రేట్ అయిన తహసీల్దారును సహకారాలు అందించవలసినదిగా కోరినట్లు చెప్పారు.



తహసీల్దారుతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి

డిబేట్ పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన దివ్యశ్రీ

పెదకూరపాడు : మండల పరిధిలోని 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని కె.దివ్యశ్రీ 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం' సందర్భంగా శనివారం పల్నాడు జిల్లా స్థాయిలో నరసరావుపేటలో జరిగిన డిబేట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించింది. శంకరభారతీపురంలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉన్నతాధికారులు చేతుల మీదుగా నగదు బహుమతి, మెమెంటోను దివ్యశ్రీ అందుకుంది. అవార్డు అందుకున్న విద్యార్థిని దివ్యశ్రీ, ఆమెకు శిక్షణ ఇచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు కె.కోటేశ్వరరావు, రమేష్‌లను హెచ్ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, చైర్మన్ పున్నారావు, గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందించారు.



అవార్డు అందుకుంటున్న దివ్యశ్రీ

విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కలిగి ఉండాలి

సత్తెనపల్లి: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువు పట్ల ఆసక్తిని కలిగి సమయపాలన పాటిస్తూ ముందుకు సాగాలని పల్నాడు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శివ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులకు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల సహకారంతో శనివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల అభివృద్ధికి సంక్షేమ పథకాల ద్వారా పాటుపడుతున్నాయన్నారు. బీసీ బాలుర వసతి గృహం సంరక్షణ అధికారి రత్నబాబు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ హెల్ప్ ఫౌండేషన్ దాతల సహాయంతో 12 పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం జరిగిందన్నారు. టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ మంచి నడవడిక, చదువు పట్ల ఆసక్తి ఉన్నప్పుడే ప్రతి విద్యార్థి విజయాలను సాధించగలడన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సురేష్, అంజి, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న శివనాగేశ్వరరావు

పక్కా గృహాలు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపండి

ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ

సత్తెనపల్లి: ప్రభుత్వం అందిస్తున్న అదనపు రుణ సాయం పక్కా గృహాలు నిర్మించుకునే పేద లబ్ధిదారులకు అందించి త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలని మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ అన్నారు. శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం అదనంగా అందిస్తుందని, ఇది లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు అధికారులు వివరించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. సమావేశంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్‌డీ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, పక్కన ఎంపీపీ జైబూన్‌బీ

కాన్షీరాం చిరస్మరణీయుడు

సత్తెనపల్లి: ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో బహుజనులను అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత కాన్షీరాంకే దక్కిందని బీసీ సంఘం నాయకులు అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పులహరి బానోజీ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరాం జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ కుల వ్యవస్థను అంతం చేయాలనే కోరికతో నడిచిన నాయకుడని, అణచివేతకు గురవుతున్న వారిని మాట్లాడటానికి, ఇతరుల హక్కుల కోసం పోరాడటానికి అనుమతించే వేదికను కాన్షీరాం సృష్టించాడన్నారు. కేంద్రంలో వీపీ సింగ్ ప్రభుత్వానికి ఓబీసీలకు 40 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని లేకుంటే కుర్చీ నుంచి దిగిపోవాలని ఢిల్లీలో 42 రోజులు పాటు బోటు క్లబ్ వద్ద దీక్ష చేసిన బహుజన నేత కాన్షీరాం అని కొనియాడారు. కాన్షీరాం తన జీవితాన్ని వెనుకబడిన తరగతులను అధికారంలోకి తీసుకురావడానికి అంకితం చేశారన్నారు. ఒక ఓటు ఒక నోటు నినాదంతో ప్రజల దగ్గరికి వెళ్లి వారి డబ్బుతోనే ప్రచారం చేసిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుంటూరు గోవిందు, చింకా అంకమ్మరావు, బడిగంచుల మస్తాన్‌రావు, పోతుల ప్రకాశరావు, షేక్ చిన్న షరీఫ్, యర్రగొర్ల శ్రీనివాస్, మోదుగుల బాబ్జి, దేవుళ్ళ జగన్నాథం, బొంత కోటయ్య, నామాల అంజి, కొమ్మూరి అశోక్, యుద్దనపూడి శివ నాగ మల్లేశ్వరాచారి, గరికపూడి బెన్నిబాబు, చింతపల్లి లాజరు తదితరులు ఉన్నారు.



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

పరీక్ష కేంద్రం పరిశీలన

ముప్పాళ్ళ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శనివారం తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. బెంచీలు, తాగునీరు, హాలులో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడే ఉన్న పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదివిన తర్వాత జవాబులు రాయాలని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు, హెచ్ఎం కే నాగేంద్రమ్మ, చీఫ్ సూపరింటెండెంట్ పీ రమేష్ తదితరులు ఉన్నారు.

